
ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం



హెచ్‌ఎంపివి పై ఆందోళన వద్దు : డిఎంహెచ్‌ఒ

పార్వతీపురంరూరల్ : హెచ్‌ఎంపిఎ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) కేసులు రాష్ట్రంలో ఎక్కడా లేవని, ఈ వైరస్ కారణంగా ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై జిల్లాలో గల వైద్యాధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేసి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వైరస్ ప్రభావం ఉంటుందని తెలిపారు. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపరల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, స్పర్శ వంటి చర్యలతో ఈ వైరస్ వ్యాపిస్తుందని పేర్కొన్నారు. వైరస్ సోకిన తర్వాత 3 నుంచి 10 రోజుల్లో బయట పడతాయని తెలిపారు. వైరస్ సోకినట్లు అనుమానం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, సొంత వైద్యం చేసుకోవద్దని కోరారు.

ప్రధాని వస్తున్నారని బడులకు సెలవు

- ఆర్‌టిసి బస్సులూ మళ్లింపు
- 24వేల మంది తరలింపునకు సన్నాహాలు
- ఆసక్తి చూపని ప్రజానీకం
- నిరాకరించినవారిపై రాజకీయ ఒత్తుళ్లు



ప్రధాని సభకు జనాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదట. చివరకు ఎలాంటి ఆర్డర్ లేకుండానే మనసులో అనుకున్నవన్నీ చకచకా జరిగిపోతాయట. ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబు పాలన ఇందుకు అద్దం పడుతోంది. విశాఖపట్నంలోని ఎయు ఇంజినీరింగ్ గ్రౌండ్‌లో బుధవారం జరగబోయే బహిరంగ సభకు మోడీ హాజరు కానున్న విషయం విధితమే. ఏర్పాట్ల కోసం అక్కడ రూ.కోట్లు ఖర్చుచేస్తున్నారు. తాజాగా మన జిల్లా అధికార యంత్రాంగం జన సమీకరణ, ప్రయాణ ఏర్పాట్లలో తలమునకలైంది. సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఆర్టీసి బస్సులను అధిక సంఖ్యలో మళ్లించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అనధికారిక సెలవు ప్రకటించారు. అనేకసార్లు ప్రధాని విశాఖపట్నం వచ్చినప్పటికీ మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రధాని సభకు జిల్లా నుంచి 24వేల మంది జనాన్ని తరలించాలని అధికార యంత్రాంగానికి లక్ష్యం విధించారు. అనుగుణంగా ఆర్టీసి విజయనగరం డిపో నుంచి 70, ఎస్.కోట డిపో నుంచి 30చొప్పున మొత్తం 100బస్సులు, మరో 150 వరకు ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇవి కాకుండా చిన్నచితక కలుపుకుని జిల్లా వ్యాప్తంగా 425 వాహనాలు ఉంటాయని సమాచారం. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఆర్టీసి డిపోల నుంచి 80బస్సులను ప్రధాని సభకు వైపు మళ్లించారు. బస్సుల మళ్లింపు నేపథ్యంలో జిల్లాలో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురు కానున్నాయి. ఈ సంగతి కాస్త అటుంచితే.... జనం తరలింపునకు ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం నానా తంటాలు పడుతోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ లక్ష్యానికి అనుగుణంగా జనాన్ని తీసుకురావాల్సిందేనంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందట.

మరోవైపు జిల్లాలోని మెజార్టీ గ్రామాల్లో వరిచేను నూర్పులు, ధాన్యం విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి చేను, ధాన్యం కూడా కల్లాల్లోనే ఉన్నాయి. వాతావరణం రోజుకోలా ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పటికీ చాలా మంది రైతులు నష్టపోయారు. ఈనేపథ్యంలో రైతు కుటుంబాలవారు ప్రధాని సభకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఈరకమైన ఇబ్బందుల వల్ల కరుడుగట్టిన టిడిపి, జనసేన కార్యకర్తలు కూడా విశాఖ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పార్వతీపురం జిల్లాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో ఈ జిల్లాలోని అధికార యత్రాంగం, ప్రజాప్రతినిధులు, జనసేన, టిడిపి నాయకులు డ్వాక్రా మహిళలపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలోని ఆయా జిల్లాలో డిఆర్‌డిఎ పీడీలకు జన సమీకరణకు ప్రధాన బాధ్యతలు అప్పగించారు. పాపం...! ఈ సంఘాల్లోనూ ఎక్కువమంది రైతు కుటుంబాలకు చెందినవారే అన్న విషయం గుర్తుకు రాలేదేమో. ఈ నేపథ్యంలో ముందుకు రాని రైతులు, డ్వాక్రా మహిళలపై కొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు కూడా మొదలయ్యాయి. ఈ సారికి మమ్మల్ని వదిలేయండి అంటూకొందరు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగా, ససేమిరా వచ్చేదే లేదంటూ మరికొందరు నాయకులు, ప్రభుత్వ సిబ్బంది ముఖంపైనే చెప్పేస్తున్నారట. మరోవైపు పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటే ప్రభుత్వంపై విమర్శలు మొదలవుతాయని భావించిన ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అనధికారిక సెలవు ప్రకటించింది. ఇందుకనుగుణంగా డిఇఒ నుంచి ఎంఇఒలకు, ఎంఇఒల నుంచి ప్రధాన ఉపాధ్యాయులకు మంగళవారం సాయంత్రం మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ విధమైన ఆదేశాలనుసారం పాఠశాల యాజమాన్యాలు బుధవారం సెలవు అని చెప్పినప్పటికీ ఎందుకు? ఏమిటి? అనే విషయాలను విద్యార్థులకు చెప్పకపోవడం గమనార్హం.

జీడి పప్పు ప్రాసెసింగ్ యూనిట్లకు తోడ్పాటు



వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని జీడిపపవి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఉద్యాన రైతులకు తోడ్పాటు అందివ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిపడకుండా విడివికెల ద్వారా మంచి ధర కల్పించేలా వ్యవసాయ, ఉద్యాన వన అధికారులు ప్రోత్సాహాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు లెమన్‌గ్రాస్ సాగుచేస్తున్నది, విస్తీర్ణం అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో లెమన్ గ్రాస్ పెంపకం విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా లెమన్ గ్రాస్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే అవకాశాలను కల్పించవచ్చని అన్నారు. జిల్లాలో సుమారు 200 ఎకరాల్లో లెమన్ గ్రాస్ సాగు చేస్తున్నట్లు అధికారులు తెలపగా శ్రీనిధి, బీసీ కార్పొరేషన్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసి జిల్లా లో వేయి ఎకరాల్లో సాగు లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవకాశాలను కూడా తెలపాలన్నారు. లెమన్ సాగు ఈ క్రాప్ కింద ఆన్లైన్ లో నమోదు చేయాలని, నమోదైన పంట వివరాలను క్షేత్రస్థాయిలో ఆన్లైన్ లో వివరాలు, విస్తీర్ణ సాగు ఖచ్చితంగా ఉండేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పునః పరిశీలన చేయాలన్నారు. భామినిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎడి మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ పరిధిలోని గదబ, సవర గిరిజన కులాల లబ్ధిదారులకు గొర్రెలు, మేకలు యూనిట్ల కొనుకోలుకు రుణాలు మంజూరు చేయాలని పశుసంవర్థక శాఖ అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా ఉన్నందున అన్ని రంగాల్లో అభివద్ధి పనుల సూచికల లక్ష్యాల సాధనకు పురోగతి స్పష్టంగా చూపాలన్నారు. మిల్లెట్ మేళాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యం నాయుడు, జిల్లా పశుసంవర్ధకశాఖ డాక్టర్ ఎస్.మన్మధ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఐటిడిఎ ఎపిఒ మురళీ, తదితరులు, పాల్గొన్నారు.

వడ్డీలేని పంట రుణాలపై అవగాహన కల్పించాలి

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు లక్షలోపు వడ్డీలేని పంట రుణాలు అందించనున్నందున పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంక్ అధికారులు, పలు శాఖల అధికారులతో డిసిసి, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2024- 25 సంవత్సరానికి రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఖరీఫ్ సీజన్ 2023కు తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రొసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం కింద యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఊతమివ్వాలని అన్నారు. ప్రధాన మంత్రి స్వానిధి, మత్స్యకారుల వీధి వ్యాపారులకు రుణాలు, ముద్రా రుణాలు మంజూరులో కొన్ని బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నందున త్వరితగతిన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంప్లాయిమెంట్ డెవలప్మెంట్‌పై యువతకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతాదారుల సౌలభ్యం కోసం మొండెంఖల్ వద్ద కొత్త బ్రాంచ్ ఏర్పాటుకు అధికారులు, ఆలోచనలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించడం, లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంక్ అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ్‌స్వరూప్, డిసిసిబి బ్యాంక్ సిఇఒ సిహెచ్.ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, ఎఎల్‌డిఎం కె.మౌనిక, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



సిసి రోడ్లును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సిసి రోడ్లను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మంచాడవలసలో రూ.11లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా రోడ్లపై గుంతలు చూశాం కానీ, గత ప్రభుత్వంలో గుంతల్లో రోడ్లు ఉండేవని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పిస్తున్నామన్నారు. సాలూరు నియోజకవర్గంలో 100 సిసి రోడ్ల పనులను రూ.5కోట్ల వ్యయంతో నిర్మించామని తెలిపారు. ఇందులో పాచిపెంట మండలంలో 27, మెంటాడ మండలంలో 20, మక్కువ మండలంలో 35, సాలూరు మండలంలో 22 రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మించి డోలీ మోతలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గిరిజన గ్రామాల్లో ఎక్కడా తాగునీరు, రోడ్లు సమస్య లేకుండా ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఉగాది నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుందని ఆమె తెలిపారు. త్వరలోనే జిల్లాలో 63 అంగన్వాడీ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసిపి నేతలు అడ్డుపడితే సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఐటిడిఎ ద్వారా గిరిజనులకు ట్రై రుణాలు అందించి, జీవనాధారం కల్పించి గిరిజనులకు అవసరమైన సదుపాయాలు సమకూర్చి పూర్వవైభవం తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ సావిత్రి, మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు గూడెపు యుగంధర్, ముఖీ సూర్యనారాయణ, ఆముదాల పరమేష్, కె.సురేష్, చల్లా కనక, కె.పోలినాయుడు, పి.నరసింగరావు, పి.ఉమామహేశ్వరరావు, మాతల బలరాం, జనసేన నాయకులు, ఎంపిడిఒ బివిజె పాత్రో, పంచాయతీరాజ్ శాఖ డిఇ చిన్నంనాయుడు, డిప్యూటీ తహశీల్దార్, పలు శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు

- వాడకం తగ్గినా పెరిగిన మోత
- వినియోగించిన విద్యుత్ కంటే ఇతర ఛార్జీలే అధికం
- ఆందోళనలో వినియోగదారులు

ప్రజాశక్తి - సీతంపేట

విద్యుత్ వినియోగదారులకు గత రెండు నెలలుగా వస్తున్న బిల్లులు షాక్‌ల మీద షాక్‌లు కొడుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్‌ఛార్జీలు పెంచమన్న చంద్రబాబు తీరా అధికారానికి వచ్చిన ఆరునెలలుగా విద్యుత్ భారాలు మోత మేయిస్తూనే ఉన్నారు. విద్యుత్‌ఛార్జీలు పెంచమంటూ అధికారంలో వచ్చిన మీరు ఇలా బిల్లులు పెంచడం ఎంత వరకు సమంజమని ప్రశ్నిస్తున్న అధికార పార్టీ నాయకులకు గత పాలకుల ఒప్పందాల వల్లేనని చెప్పుకొస్తున్నారు. ఏదేమైనా వినియోగదారులకు భారాలు తప్పడంలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజీ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో విధించిన ఛార్జీలు ప్రజలకు భారంగా మారాయి. గత ప్రభుత్వం ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి వివిధ రూపాల్లో విధించిన బిల్లుల భారం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం నవంబర్ నుంచి ఎఫ్‌పిపిసిఎ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించడంతో ఆ భారానికి ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలు తోడై వినియోగదారులపై మరింత భారం పడింది. వీటికి తోడు సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్ కస్టమర్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో విధించిన ఛార్జీలతో వస్తున్న బిల్లులను చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. మండలంలోని కంబగూడకు చెందిన ఆరిక పద్మ రేకింట్లో నివాసముంటోంది. ఈమె ఫ్యాను, మూడు బల్బులు వినియోగిస్తోంది. ఈమె (సర్వీస్ నెంబర్ 131512 పి 4400040) 59 యూనిట్లు విద్యుత్ వినియోగించారు. ఇందుకు గానూ ఈనెల ఆమెకు రూ.1752 బిల్లు వచ్చింది. 59 యూనిట్లకు ఇంత బిల్లు రావడంతో ఆమె గుండె గుభేల్ మంది. ఈ బిల్లులో వినియోగించిన యూనిట్ల కంటే ఇతర చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ఎఫ్‌పిపిపిసిఎ, కస్టమర్ చార్జీలు, సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎనర్జీల ఛార్జీ, ఇలా అన్ని ఛార్జీల పేరి రూ.1752 బిల్లు వచ్చింది. పద్మ ఎస్‌టి తెగకు చెందినవారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితం. అయినా పద్మకు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వచ్చింది. ఉన్న ఇల్లు రేకిళ్ల మాత్రమే సాధారణంగా ఫ్యాను మూడు బల్బులు ఉన్నాయి. అలాగే సీతంపేటకు చెందిన బూసి గోవింద (విద్యుత్ సర్వీస్ నెంబర్ 13512 పి 384001168) గత నెల బిల్లు రూ.805 విద్యుత్ బిల్లు వచ్చింది. ఇంత శీతాకాలంలో ఫ్యాన్లు కూడా వినియోగించని తమకు ఇంత పెద్దమొత్తంలో బిల్లు రావడం పట్ల వినియోగదారుడు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వినియోగం తక్కువ సమయంలో ఇంత పెద్దమొత్తంలో బిల్లులు వస్తే రానున్న వేసవిలో వినియోగం పెరిగి ఇంకెంత పెద్దమొత్తంలో బిల్లులు వస్తాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివిధ ఛార్జీల పేరిట వేస్తున్న విద్యుత్‌భారాలను తగ్గించాలని కోరుతున్నారు.



వినియోగదారుడు గోవిందకు అధిక మొత్తంలో వచ్చిన బిల్లు

బిల్లును చూసి షాకయ్యా

మాది చిన్న రేకు ఇల్లు. ఒక ఫ్యాను, మూడు బల్బులు, టీవీ మాత్రమే ఉన్నాయి. 59 యూనిట్లు వినియోగిస్తే రూ. 1752 బిల్లు వచ్చింది. దీంతో బిల్లును చూసి షాకయ్యా. ఎస్టిలమైన తమకు 200 యూనిట్లు లోపు ఉచితం అయినప్పటికీ ఇంత మొత్తంలో బిల్లు రావడం కష్టంగా ఉంది.



ఆరిక పద్మ ,కంబగూడ

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

విద్యుత్ బిల్లు ఇటీవల కాలంలో ఎక్కువ వస్తున్నాయి. వాడింది తక్కువైనప్పటికీ బిల్లు మాత్రం ఎక్కువ రావడంతో చెల్లించలేని పరిస్థితి దాపురించింది. ఇప్పటికే రూ.805 బిల్లు వచ్చింది.



బూసి గోవింద, సీతంపేట.

మౌలిక వసతులు కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల ఎనిమిది సబ్‌ప్లాన్ మండలాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పక్కాగా అమలు కావాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సబ్ ప్లాన్ మండలాలకు చెందిన వివిధ శాఖ అధికారులతో పిఒ తన ఛాంబరులో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ ప్లాన్ మండలాల్లో ప్రగతికి సంబంధించి రోడ్డు నిర్మాణం, విడివికెల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, వసతి గృహాలు, పాఠశాలల మౌలిక సదుపాయాల గురించి అడిగి విద్యార్థులకు వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వారంలో ఎఎన్ఎంలు రెండు సార్లు పాఠశాలలను సందర్శించాలని ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిని పిఒ ఆదేశించారు. విద్యుత్, వ్యవసాయం, ఉద్యానవన పంటలు, విడివికెల నిర్వహణ, తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య, పంచాయితీ రాజ్, వెలుగు, విద్య ఉపాధిహామీ, వాటర్ షెడ్, వ్యవసాయ, ఉద్యానవన, జిసిసి తదితర శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎఎస్‌పి దిలీప్ కిరణ్ బదిలీ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లా అదనపు ఎస్‌పి డాక్టర్ దిలీప్ కిరణ్‌ను బదిలీ చేస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఎసిబి అదనపు ఎస్పీగా బదిలీ అయినట్లు సమాచారం. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఈయన జిల్లాలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాకు అదనపు ఎస్పీగా ఎవర్నీ నియమించలేదు. అతి త్వరలో అదనపు ఎస్పీలు నియమిస్తారని ఉన్నతాధికారులు తెలిపారు.

భద్రగిరి ఐసిడిఎస్ ఇంఛార్జి సిడిపిఒగా రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం



భద్రగిరి ఐసిడిఎస్ ఇంఛార్జి సిడిపిఒగా ఎన్.రాజ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కురుపాంలో ఎసిడిపిఒగా విధులు నిర్వహిస్తూ భద్రగిరి ఇన్చార్జి సిడిపిఒగా ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిహెచ్.సుశీలాదేవి గుంటూరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఈ మేరకు భద్రగిరి సిడిపిఒ ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు కురుపాం ఎసిడిపిఒ రాజ్యలక్ష్మిని భద్రగిరి కి పంపించారు.

చేపల చెరువుల్లో గ'లీజు'

- అప్పనంగా ఇచ్చేందుకు నగర పంచాయతీ అధికారుల ప్రయత్నం
- మౌనం దాల్చుతున్న పాలక వర్గం

ప్రజాశక్తి - పాలకొండ

నగరపంచాయితీలో చేపల చెరువు లీజుల విషయంలో గలీజు చోటు చేసుకుంటుంది. పట్టణంలో కాంప్లెక్స్ వెనకాల 15 ఎకరాల విస్తీర్ణం కలిగిన వెంకటరాయుని చెరువును చేపల పెంపకానికి అప్పనంగా లీజుకు ఇచ్చేందుకు నగరపంచాయితీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నగరపంచాయితీ ఆదాయానికి గండి కొట్టేలా లీజుకు ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఏడాదికి రూ.15వేలు చొప్పున మూడేళ్ల వ్యవధికి లీజుకు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై నగరపంచాయితీ పాలకవర్గం కూడా మౌనం దాల్చడం చర్చనీయాంశమవుతుంది. మత్స్యకార సంఘాలకు లీజుకు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఒక వ్యక్తికీ లీజు కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. బినామీ పేరుతో ఆ వ్యక్తికి లీజు కేటాయించడానికి నగరపంచాయితీ అధికారులు, పాలకవర్గం సిద్ధమవుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో కూడా సదరు వ్యక్తి ఇక్కడ చక్రం తిప్పి లీజు పొందారు. మళ్లీ ఆ వ్యక్తికే లీజుకు కేటాయించడంతో సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరపంచాయితీ పరిధిలోని 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కల్యాణి కోనేరు చెరువులో చేపల పెంఎంరకానికి నగరపంచాయతీకి ఏడాదికి రూ.45వేలు లీజు రూపంలో, చెరువు శుభ్రం చెయ్యడానికి మరో రూ.30వేలు వసూలు చేశారు. వెంకటరాయుని కోనేరు విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహారిస్తున్నారో తెలియడం లేదు.



వెంకటరాయుని కోనేరు

చేపల పెంపకానికి ఇవ్వవద్దు

వెంకటరాయుని కోనేరు చేపల పెంపకానికి ఇవ్వొద్దని స్థానిక కౌన్సిలర్ కొంచాడ అరుణ్, స్థానికులు కోరుతున్నారు. చెరువు శుభ్రం చేసుకుని తాము వాడుకుంటామని దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు.

క్షేత్రస్థాయిలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీ సిబ్బంది వేతనదారులకు పనులు కల్పించడంలో అలసత్వం వహించరాదని సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయ అధికారులను ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. జియమ్మ వలస మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బందికి సిఆర్‌డిఎ కమిషన్ ద్వారా వీడియో కాన్ఫిరెన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ శంబంగి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్సు లో భాగంగా ఉపాధి హామీ సిబ్బందికి దరఖాస్తు చేసుకున్న ప్రతి వేతనదారునికి జాబ్ కార్డు అందేలా చూడాలని, శ్రమశక్తి సభ్యులకు సంఘాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పనులు జరిగేటప్పుడు పర్యవేక్షించే విధానం, వేతనదారులు పనిచేసిన అనంతరం వాటి కొలతలు నమోదు ప్రక్రియ చూడాలని సూచించారు. పని కోసం దరఖాస్తు చేసుకునే వారి నుండి డిమాండ్ తీసుకోవాలని, ప్రతిరోజూ మస్తర్‌లో హాజరు ఆన్లైన్ ద్వారా పంపించాలని, పనులను జియో ట్యాగింగ్ చేయాలని, పని పెట్టే ప్రదేశంలో క్షేత్ర సహాయకులు ప్రథమ చికిత్స కిట్లను వేతనదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

పక్కాగా భూముల రీసర్వే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మండలంలోని గోపాలపురంలో మంగళవారం రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో అయన పాల్గొన్నారు. రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియ, వెరిఫికేషన్ సమయంలో ఉండాల్సిన పత్రాలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. సరైన పత్రాలు లేకుండా వెబ్‌ల్యాండ్‌లో పేరు మార్చువద్దని సిబ్బందికి సూచించారు. రైతుల భూములన్నింటినీ రీ సర్వే చేయాలని ఆయన ఆదేశించారు. రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, స్థానికులు, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిసిసి బ్రాంచి మేనేజర్ రామారావు

అటవీ ఉత్పత్తుల ధరలపై అవగాహన


ప్రజాశక్తి - సాలూరు

గిరిజనులు తాము సేకరించిన అటవీ ఉత్పత్తుల ధరలపై అవగాహన పెంచుకోవాలని జిసిసి బ్రాంచ్ మేనేజర్ జె.రామారావు కోరారు. ముగళవారం మండలంలోని నేరెళ్లవలసలో గిరిజనులకు అటవీ ఉత్పత్తుల ధరలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సీజన్‌లో చిన్న తరహా అటవీ ఉత్పత్తుల ధరలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. గత ఏడాది సీజన్‌లో నిర్ణయించిన ధరల కంటే పెంచి ప్రభుత్వం కొత్త ధరలు ప్రకటించిందని చెప్పారు. చింతపండు కిలో ధర 34 రూపాయలుగా నిర్ణయించిందన్నారు. అన్ని రకాల ఉత్పత్తులకు ధరలు పెరిగాయని చెప్పారు. ధరలు, తూనికలు కొలతల విషయంలో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సేకరించిన ఉత్పత్తులను సమీపంలో ఉన్న జిసిసి సేల్స్‌మాన్లకు విక్రయించాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని మేనేజర్ రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో జిసిసి సేల్స్ మాన్ లు పాల్గొన్నారు.

డీలర్ల భర్తీ పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రేషన్ డీలర్ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ డీలర్ పోస్టులకు నిర్దేశించిన అర్హత, పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరగాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగవద్దని కోరారు. డీలర్ పోస్టులకు అనేక మంది పేద యువకులు కూడా దరఖాస్తు చేశారని, వారికి అన్యాయం చేయొద్దని రంజిత్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.



బహుమతిని అందుకుంటున్న శ్రీనివాసరావు

బాడ్మింటన్ పోటీల్లో టీచర్‌కు బహుమతి

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ రాష్ట్ర స్థాయి స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరులో నిర్వహించిన ఆటల పోటీల్లో బ్యాడ్మింటన్ సింగల్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఉపాధ్యాయుడు సింగారపు శ్రీనివాసరావుకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు బహుమతి ప్రదానం చేశారు. ఈనెల 5,6,7,8 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల్లో శ్రీనివాసరావుకు బహుమతి అందజేశారు. మండలంలోని పునికిలవలస ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయిలో బహుమతి లభించడంపై మండల యుటిఎఫ్ నాయకులు అభినందించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి వర్మ

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట, కృష్ణరాయిపురం గ్రామాల్లో జరుగుతున్న పనులను ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా కార్యదర్శులకు సూచించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు కె.సింహాచలం, జి.అన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, పైడిరాజు పాల్గొన్నారు.

గారమ్మ కాలనీలో నీటికి కటకట

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని గారమ్మ కాలనీలో తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. గత కొంతకాలంగా పైప్లైన్ మరమ్మతులు గురవ్వడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇక్కడ ప్రజలు నగరపంచాయతీ ద్వారా వచ్చే ట్యాంకర్ నీటిపై ఆధారపడుతున్నారు. ప్రతిరోజు నగరపంచాయితీ ద్వారా వాటర్ ట్యాంక్ వస్తున్నప్పటికీ సరిపడినంత నీటిసరఫరా జరగకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో పనులు మానుకుని నీరు ఎప్పుడు వస్తుందానని రోడ్డుపై ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



ట్యాంకర్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న గారమ్మ కాలనీవాసులు

హెచ్‌ఎంపివిపై అవగాహన కల్పించండి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

హెచ్‌ఎంపివి వైరస్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి వైరస్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఆర్‌సిహెచ్ నమోదు వేగవంతం చేయాలని, మలేరియా కేసులు ఎక్కువగా నమోదు కాకుండా చూసుకోవాలని తెలిపారు. రక్తహీనతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆశా యాప్ మానిటరింగ్‌పై అవగాహన కల్పించారు. ఆర్‌బిఎస్‌కె అండ్ ఎన్సిడి ఫీల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. ఎఫ్‌ఆర్‌సి సమయానికి వేయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రికార్డులను, మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు ఎ.మానస, ఎస్ నితీసా, సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

కురుపాం : ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి అన్నారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పూర్తి రోగ నిరోధక శక్తి, ఇమినేషన్ షెడ్యూల్, మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుల వాడకం, ఆర్‌సిహెచ్ పోర్ట్రల్‌లో గర్భిణుల నమోదు, శిశు మరణాల రేట్లు తగ్గించే విధానం, ఈ ఆశా యాప్, సర్వీస్ అప్డేట్ పర్యవేక్షణ గురించి ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఆశా కార్యకర్త తనకు కావాల్సిన అన్ని ప్రెగ్నెన్సీ కిట్లు ఉండేలా చూసుకోవాన్నారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ ప్రజ్ఞ, హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: ఆశా డే కార్యక్రమం సందర్భంగా మండలంలోని పెదంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు రాధాకాంత్, పావని, ఉషారాణి ఆధ్వర్యంలో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారులు సిబ్బందితో మాట్లాడుతూ చిన్న పిల్లలు శ్వాసకోశ వ్యాధులకు చెందిన శాన్స్ ప్రోగ్రాం గురించి వివరిస్తూ ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య సర్వే త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత శాన్స్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. లెప్రసీ సర్వేలో లక్షణాలు గుర్తించిన వారికి వెంటనే చికిత్స ఇచ్చి పర్యవేక్షణ చేయాలని, సర్వే వివరాలు ఎల్‌సిడిసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణీల నమోదు ప్రక్రియ మొదటి మూడు నెలల్లో పే జరగాలని, కాన్పుల మధ్య నిర్ణీత సమయం వుండాలని, అందుకు అంతర, పి పి ఐ యు సి డి పద్ధతులపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి నెలా 9న ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమానికి గర్భిణీలంతా వచ్చి పూర్తి స్థాయిలో పరీక్షలు, తనిఖీలు చేపట్టేలా చూడాలన్నారు. వీటన్నింటి ద్వారా మాతా, శిశు మరణాలులను నివారించవచ్చని వివరించారు. కదల్లేని స్థితిలో ఉన్న వారి గృహ సందర్శన చేసి పూర్తి స్థాయిలో ఆరోగ్య పర్యవేక్షణ జరపాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్వైజర్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వీరఘట్టం : ఆశాల సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

బలిజిపేట : గ్రామీణ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అరసాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. శిశు ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల్లో టీకాలు ముఖ్యమని, పిల్లలకు వారి వయస్సుకు తగ్గట్టుగా సకాలంలో టీకాలు వేయాలని తెలిపారు. తద్వారా ప్రాణాంతక వ్యాధులైన పోలియో, తట్టు, క్షయ, దనుర్వాతం, న్యుమోనియా, హెపటైటిస్, డయేరియా, దృష్టి సమస్యలు, కంఠసర్పి, కోరింత దగ్గు నుంచి పిల్లలకు రక్షణ ఉంటుందన్నారు. టీకా వేసిన, గడువు తేదీలను ఎంసిపి కార్డులో నమోదు తప్పనిసరి అని సూచించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని, అందుకు ఇసి (అర్హులైన జంటలు)లను గుర్తించి పర్యవేక్షించే కార్యాచరణ ఆశాలు చేపట్టాలన్నారు. తద్వారా గర్భిణుల్లో హైరిస్క్ సమస్యలను ముందస్తుగా అనంతరం కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమానికి సంబంధించి బ్యానర్‌ను వైద్య సిబ్బందితో కలిసి పిహెచ్‌సి ఆవరణలో ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శివగాయిత్రి, డిపిఎంఒ మూర్తి, సూపర్వైజర్లు నారాయణరావు, సత్యవతి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు అన్నారు.

ఎంఇఒగా సబార్డినేట్ చలామణి

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్ ఎంఇఒగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్లగా మండలంలోని అరసాడలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులను, ఆయాల తొలగింపు విషయంపై అంతా తానై వ్యవహరిస్తున్నాడని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు తెలిపారు. అంతేకాక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫోన్ చేసి మాట్లాడడం, వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. అరసాడలో శాంతిభద్రతల సమస్యకు కారణంగా ఆఫీస్ సబార్డినేటర్ తీరేనన్నారు. ఈయన వ్యవహార

ఫోన్లలో హెచ్‌ఎంలకు బెదిరింపు : సిఐటియు

శైలివల్ల మూడు నెలలుగా ఆ గ్రామంలో ఈ సమస్యపై పచ్చగడ్డి వేస్తే బొగ్గుమన్న రీతిగా అధికార పార్టీ నాయకులు రెండు కులాల మధ్య కుంపటి పెట్టి రాజేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులను బెదిరిస్తూ ఉద్యోగస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, పద్ధతి మార్చుకోకపోతే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మన్మధరావు హెచ్చరించారు.



సిహెచ్‌ఒకు వినతిని అందజేస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఆశాలు నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్లమ్మ, హైమా మాట్లాడుతూ మండలంలోని కొమరాడ, మాదలింగి, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 110 మంది వరకు ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని, వీరిక పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే టిఎ, డిఎ ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. పెన్షన్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిహెచ్‌ఒ బంగారుబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామభద్రపురం పిహెచ్‌సి పరిధిలోని పనిచేస్తున్న ఆశా కార్యకర్తలంతా పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని స్థానిక సిహెచ్‌సి వైద్యాధికారి శృతి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సెట్విజ్ సహకారంతో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. తద్వారా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని తెలిపారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని, విద్యార్థి దశ నుండే చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి లక్షణాలను అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి శృతి

విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఎవి రవణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ, గోవిందం, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఉపాధ్యాయుడు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



బ్రెయిలీకి నివాళ్లు అర్పిస్తున్న అధికారులు, అంధులు

అంధుల ఆరాధ్యుడు బ్రెయిలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎండి గయాజుద్దీన్ అన్నారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆర్‌సిఎం (పాఠశాల) ప్రాంగణంలో బ్రెయిలీ చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ బ్రెయిలీ భాషను కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ వేడుకలు జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. అంధులకు ఉండే హక్కులు, వారు ఎదుర్కొనే సమస్యలపై అవగాహనా కలిగిండాలన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి కె.కవిత మాట్లాడుతూ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ప్రతిఏటా జనవరి 4న జరుపుకుంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా దృష్టిలోపంతో జీవిస్తున్న వారికి ఈ రోజు ఎంతో ప్రత్యేకమైందన్నారు. లూయిస్ బ్రెయిలీ అనే మహనీయుని పుట్టినరోజు సందర్భంగా బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ఆయనే బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారని, బ్రెయిలీ లిపి అనేది అంధులు చదవడానికి, రాయడానికి ఉపయోగించే భాష. పుట్టుకతోనో, లేదా ఇతరత్రా కారణాలతో కంటి చూపు కోల్పోయిన వారు చదువుకు దూరమవ్వకుండా ఉండేందుకే బ్రెయిలీ లిపిని రూపొందించారని ఆమె అన్నారు. అంధత్వంతో బాధపడుతున్న వారు తమ స్వశక్తితో సమాజంలో ఇతరులతో సమానంగా నిలిచేందుకు బ్రెయిలీ లిపి దోహదపడుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దృష్టిలోపంతో సతమతమవుతున్నవారికి లూయిస్ బ్రెయిలీ తన ఆవిష్కరణతో మార్గదర్శిగా నిలిచారని అన్నారు. లూయిస్ బ్రెయిలీ జీవించి ఉన్నప్పుడు దక్కని గౌరవం అతని మరణాంతరం దక్కిందన్నారు. ఆయన పుట్టినరోజును ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరపుకోవడమే ఆయనకు దక్కిన అత్యున్నత గౌరవమని ఆమె అన్నారు. కార్యక్రమంలో విసిఇఎ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, అంధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే అధిక మార్కులు : డిఇఒ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఇష్టంతో చదివితే విషయ అవగాహన సులభంగా వస్తుందని తద్వారా మార్కులు సాధించవచ్చని డిఇఒ డాక్టర్ నల్ల తిరుపతి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలతో పాటు, కొత్తూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై డిఇఒ పలు సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతులను ఏకాగ్రతతో వినాలని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలన్న పట్టుదలతో ఉన్నామన్నారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులు చక్కగా చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ పరిశీలనలో ఎంఇఒ-2 కె.కొండల రావు, ఉపాధ్యాయులు చందక శంకర్రావు, సిఆర్‌పి బోను రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యాధికారుల సర్వే

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వికలాంగుల అర్హతను గుర్తించేందుకు ప్రభుత్వం నియమించిన వైద్యాధికారుల బృందం గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మండలంలోని ఉల్లిభద్ర, రావుపల్లి, పెద్దూరు, గ్రామపంచాయతీల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నియ మించిన డాక్టర్ రవికుమార్, డాక్టర్ నర్సింగరావు పింఛన్లు పొందుతున్న వికలాంగుల అర్హత ధ్రువపత్రాలను పున: పరిశీలించడంతో పాటు, పింఛన్లు పొందేందుకు అర్హులా? కాదా అనే విషయం పరిశీలించారు. వైద్యాధికారుల బృందం పింఛన్లు తీసుకునేందుకు అర్హులా కాదా అనే విషయం తేల్చనున్నారు. గ్రామ పంచాయతీల వారీగా పరిశీలన పూర్తయిన అనంతరం పింఛన్లు తీసుకునేందుకు అర్హులైన వారి వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అందజేయనున్నారు. ఈ పరిశీల నలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె కె సాగర్ వర్మతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రె పందేలపై దాడులు

వీరఘట్టం : మండలంలోని నడిమికెళ్ల సమీపాన మంగళవారం గొర్రె పందాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకొని గొర్రెతో పాటు నలుగురు వ్యక్తులను, నాలుగు ద్విచక్ర వాహనాలు రూ.3020 స్వాధీనం చేసుకుని గొర్రెపోతులను వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

ముగిసిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎపిఎస్‌ఎస్‌డిసి ఆధ్వర్యంలో సంకల్ప పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదురోజులుగా మండలంలోని డోకిశీల సచివాలయంలో జరుగుతున్న అవగాహన సదస్సులు మంగళవారంతో ముగిశాయి. ఈ అవగాహన సదస్సుల్లో వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని పూర్తిచేసుకున్న 30 మంది యువతీ యువకులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సులో సర్టిఫికెట్ అందజేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. కార్యక్రమంలో వెలుగు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కడగండి, రోలుగుద్ది, చాకలిగూడలో మంగళవారం జై ఆదివాసీ ఎఫ్‌పిఒ సహకారంతో విజయనగరం పుష్పగిరికంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితకంటివైద్య శిబిరం నిర్వహించారు. మూడు గ్రామాల్లో 271 మందికి పైగా కంటి పరీక్షలు చేయగా, 98 మందికి ఆపరేషన్లు పడతాయని గుర్తించారు. వీరందర్నీ విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ అనంతరం మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామని పుష్పగిరి మేనేజర్ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, జై ఆదివాసీ ఎఫ్‌పిఒ చైర్మన్ కుండంగి గణపతి, డైరెక్టర్లు పాలక ప్రభ, రమాదేవి, రాధ, రమేష్, భాస్కరరావు, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు

యువతీ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు కోరారు. మంగళవారం స్థానిక వైటిసిలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనమవుతుందని చెప్పారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగించినా శిక్షార్హులవుతారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులకు ఆధార్, ఒటిపి నెంబర్లు చెప్పొద్దని కోరారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ పుస్తకాలు, ఎటిఎం కార్డులు అందజేయొద్దని కోరారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మోహన్‌రావు, వైటిసి మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

కేసలిలో గులి రాగి క్షేత్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పాచిపెంట

సాధారణ రైతు వారి పద్ధతి కంటే గులి పద్ధతిలో చోడి పంట నాటుకుంటే సాధారణం కంటే దిగుబడులు రెట్టింపు అవుతాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కేసలిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. గతేడాది కేసలిలోని గుళి పద్ధతిలో చోడి పంట ప్రదర్శనా క్షేత్రం ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మీసాల మోహన్ రావు అనే రైతుతో పాటు మరో ఐదుగురు రైతులు గుళి పద్ధతిలో చోడి పంటను పండించడానికి ముందుకొచ్చారని తెలిపారు.

గులిచోడి సాగు పద్ధతి

ముందుగా ఎత్తయిన నారుమడిని తయారు చేసుకొని ఎకరాకు అరకిలో చోడి విత్తనాన్ని పలుచగా నారు పోసుకోవాలి. 15 రోజులుగా ఉన్న నారును అడుగున్నర దూరంలో ఒక్కొక్క మొన నాటినట్లయితే సుమారు 40కి పైగా పిలకలు వచ్చి అత్యధిక దిగుబడి పొందవచ్చు. 20 రోజులు, 40 రోజులకు ఒక చెక్కను పంటపై లాగాలని, మొక్కల్లో కణజాలంలో కదలిక జరిగి అధిక పిలకలు వస్తాయని తెలిపారు. ప్రకృతి సేద్య పద్ధతిలో సాగుచేయదల్చిన రైతులు ప్రతి 15 రోజులకు ఒకసారి ఎకరానికి 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని నాలుగు లేదా ఐదు సార్లు పారించుకోవాలని, అవసరాన్ని బట్టి కషాయాలు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ పద్ధతిపై శిక్షణ కావాల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. రైతులతో కలిసి 200 లీటర్ల ద్రవ జీవామతాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు తిరుపతినాయుడు, ఎల్ టు సురేష్ విజయ్ నరసింహమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందం ఆదర్శ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలను సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) భాగంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు మంగళవారం ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. ఈ సామాజిక తనిఖీ బృందంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ డి.దాసు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు వరాహమూర్తి, బి.శ్రీను ఉన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతుల నిర్వహణ, మరుగుదొడ్లు, గ్రంథాలయం, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి అభిప్రాయం, సమాచారం సేకరించారు. పాఠశాల అభివృద్ధికి సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ వి.రవికుమార్, వైస్ చైర్మన్ ఎం.ధనలక్ష్మి, సభ్యులు కొత్తకోట తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చప్పగొత్తిలిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని చప్పగొత్తిలిలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మిరప పంట మార్పిడి, వంగ, టమోటా, చిక్కుడు, తీగజాతులు, ఆకుకూరలు పండించే విధానం, తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సూచనలు పాటిస్తే రైతులు అధిక లాభాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతిరావు, ఎపిసిఎస్‌ఎఫ్ సిబ్బంది సన్నిదొర, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వీరఘట్టం : మండలంలోని వండువ సమీపాన ఓ వ్యక్తి 20 లీటర్ల నాటు సారా అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు స్థానిక ఎస్సై జి.కళాధర్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని పాలకొండ కోర్టులో హాజరపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు మంగళవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పకుండా భద్రతా నియామలను పాటించాలని, హెల్మెట్ వేసుకునున్న వాహనదారుడు తప్పకుండా కిల్ప్‌ను తగిలించుకోవాలని తెలిపారు. మితిమీరిన వేగంతో ప్రయాణం చేయొద్దని గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని వాహనదారులకు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చట్టపరంగా నేరమని 14 ఏళ్లలోపు వారికి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, ఇటువంటి ప్రమాదం జరిగిన తల్లిదండ్రులు శిక్షా అర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబ్జీ, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ సిబ్బందికి సిఆర్డిఎ నుండి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతున్న శిక్షణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు జరిగేటప్పుడు పర్యవేక్షించే విధానం, వాటి కొలతల నమోదు, కొత్త జాబ్ కార్డు మంజూరు, లబ్ధిదారులకు పని కల్పించే విధానం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారని, సిబ్బంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో అమలుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ పి.బావాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.